29.9.2000 ఉదయం శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము

# ఆత్మవిశ్వాసం : మానవతా విలువలు

బ్రతికినన్నినాళ్ళు ఫలములిచ్చుటె కాదు
చచ్చి కూడ చీల్చి ఇచ్చు తనువు
త్యాగభావమునకు తరువులే గురువులు
ఉన్నమాట తెలుపుచున్నమాట

ఈనాటి గురువులలో నిజంగా త్యాగశీలురైనవారు లేకపోలేదు. దేశమును ఉద్ధరించవలెనన్న విద్యార్థులను ఉద్ధరించాలి. విద్యార్థులు బాగుపడినప్పుడు యావత్ప్రపంచమే బాగుపడుతుంది. అధ్యాపకులు ట్యాంకువంటివారు, విద్యార్థులను ట్యాప్స్‌తో పోల్చవచ్చును. ట్యాంకులో పరిశుద్ధమైన జలమున్నప్పుడే ట్యాప్స్‌లో కూడా పరిశుద్ధమైన జలము వస్తుంది. కనుక, విద్యార్థులలో పవిత్రమైన భావాలు అభివృద్ధి కావలెనన్న మొట్టమొదట అధ్యాపకుడు తన హృదయాన్ని పవిత్రమైన భావాలతో నింపుకోవాలి. “సద్గుణంబులు, సద్బుద్ధి, నిత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనంబు నేర్పువాడె అధ్యాపకుడు, విద్యార్థి నేర్వవలయు” అధ్యాపకుడు ఆదర్శప్రాయులుగా ఉన్నప్పుడే దేశంలో విద్యావిధానం బాగుపడుతుంది. అధ్యాపకుడు చెడిపోతే అనేకవందలమంది విద్యార్థులు చెడిపోతారు. అధ్యాపకులు మద్యపానము, ధూమపానము... ఇత్యాది దురభ్యాసాలకు లోనైనప్పుడు అతనిని చూసి విద్యార్థులు కూడా ఆ దురలవాట్లను నేర్చుకుంటారు. కనుక, అధ్యాపకుడు సత్కర్మలచేత, సదాచారములచేత విద్యార్థులకు ఆదర్శమునందించాలి. అధ్యాపకునికి దైవభక్తి ఉండాలి. దైవభక్తి లేనివాడు అధ్యాపకుడే కాడు. అనేకమంది పిల్లలకు చదువు చెప్పి, వారిని అభివృద్ధికి తెచ్చి, ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలంటే దైవభక్తి అత్యవసరం. కాబట్టి, అధ్యాపకుడు దివ్యమైన భావాలను అభివృద్ధిపరచుకోవాలి. డ్రిల్లు మాస్టరు “వన్,టూ, త్రీ,ఫోర్....” అంటూ తాను డ్రిల్లు చేసి చూపిస్తూ పిల్లలకు నేర్పిస్తాడు. అదేవిధంగా అధ్యాపకుడు మానవతావిలువలను ఆచరణలో చూపిస్తూ, పిల్లలకు బోధించాలి. అప్పుడే అతడు బోధించేది పిల్లల హృదయాలకు హత్తుకుంటుంది. అధ్యాపకుడు ఒక ‘గైడ్ పోస్టు’ (త్రోవ చూపే స్తంభము) వంటివాడు. ‘గైడ్ పోస్టు’ స్థిరంగా లేకపోతే అది అటూ, ఇటూ

sri sathyasai vahanamrutam

తిరిగిపోయి ప్రయాణికులకు సరియైన మార్గాన్ని చూపించలేదు. అదేరీతిగా అధ్యాపకుని మనస్సు చంచలమైనదిగా ఉంటే విద్యార్థులను సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టలేదు. కనుక, అధ్యాపకుని మనస్సు స్థిరమైనదిగా ఉండాలి. విద్యార్థులపట్ల అధ్యాపకుడు స్వార్థరహితమైన ప్రేమను పెంచుకోవాలి. ఏదో ఒక వాంఛ పెట్టుకొని పిల్లలను ప్రేమిస్తే, అది స్వార్థప్రేమ అవుతుంది.

**పుస్తకజ్ఞానం 'ఎలర్జీ' – అనుభవజ్ఞానం 'ఎనర్జీ'**

విద్యార్థులయందు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక భావములే లేకుండిన ఎన్ని చదువులు చదివినా అవి పెడమార్గం పడతాయి. ఒక చిన్న ఉదాహరణ: భార్యాభర్తలు గొప్ప విద్యావంతులైనప్పటికీ, గొప్ప పదవిలో ఉన్న వారైనప్పటికీ, కొన్ని కొన్ని సందర్భములందు వారి మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడి విడిపోతున్నారు. గొప్ప విద్యావంతులుకూడా ఇలా ప్రవర్తించటానికి కారణమేమిటి? వారు నేర్చిన విద్యలన్నీ కేవలం Bookish Knowledge కి (పుస్తకజ్ఞానమునకు) సంబంధించినవి. ఈనాటి Bookish Knowledge రేపటికి 'ఎలర్జీ' గా మారిపోతుంది. విద్యార్థులు 'ఎనర్జీ'ని అభివృద్ధి పరచుకోవాలిగాని, 'ఎలర్జీ'ని కాదు. 'ఎనర్జీ' కావాలంటే Bookish Knowledge ని ప్రక్కకు పెట్టి Practical Knowledge ని (అనుభవజ్ఞానమును) సంపాదించాలి. దీనితోపాటు Discrimination Knowledge (విచక్షణా జ్ఞానము) అవసరం. ఏ పనైనా చేయటానికి ముందు కొంత టైము తీసుకొని "ఇది మంచిదా, చెడ్డదా?" అని విచారణ చేయాలి. తొందరపాటు మంచిది కాదు. గొప్ప విద్యావంతులైన భార్యాభర్తలు కూడా తొందరపాటుతో విడిపోవాలని నిర్ణయించుకుంటే ఇంక ఇంటిపరిస్థితి ఏమైపోతుంది? తల్లిదండ్రులను వృద్ధాశ్రమానికి తరలిస్తారు. పిల్లలను ఏదో ఒక బోర్డింగు స్కూల్లో చేర్చి వారి సంగతే పట్టించుకోరు. తత్ఫలితంగా పిల్లలు పెడమార్గం పట్టి, దురభ్యాసములకు లోనై జీవితాన్ని నాశనం చేసుకుంటారు.

**గృహమే విలువలయొక్క నిలయం**

మొట్టమొదట గృహంలో మానవతావిలువలను అభివృద్ధి చేయాలి. అప్పుడే గృహంలో ఉన్న ప్రతివ్యక్తి ఆదర్శప్రాయుడు కాగలడు. ప్రతి గృహస్థుడు "ఇది నాఇల్లు. నేనిందులో పవిత్రతను పెంచాలి. నా కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆదర్శమును అందించాలి" అనే పవిత్రమైన దీక్షను చేపట్టాలి. గృహమే విలువలయొక్క నిలయమనే సత్యాన్ని గుర్తించాలి. ఈనాటి

sri sathyasai vachanamrutam

విద్యావంతులు, అందులోనూ ఉన్నత పదవిలో ఉన్నవారు తమ ఇంటినే మాత్రం పట్టించుకోరు; ఇంటిని ఒక సత్రంగానో, ఒక హోటల్‌గానో భావిస్తారు. ఆఫీసునుండి ఎప్పుడు తిరిగి వస్తారో, ఎప్పుడు బయటికి పోతారో వారికే తెలియదు. ఈ ఆధునిక ప్రభావంచేత గృహసంబంధమైన విషయాలలో ఆధునిక భావములు ప్రవేశించి జీవితాన్ని అస్తవ్యస్తం గావిస్తున్నవి. ఆధునికత పేరిట హృదయంలో చిల్లర భావాలకు చోటివ్వకూడదు. ఈ యుగం ఆధునికయుగమే! కాని, మన భావాలు సనాతనమైనవిగా, అత్యున్నతమైనవిగా ఉండాలి. ప్రతి గృహస్థుడు, ప్రతి గృహిణి మానవతావిలువలను అభివృద్ధిపరచుకొని, తమ కుటుంబాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి.

మానవతావిలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలలో ఏది ప్రధానమైనదని కొందరు అడుగుతుంటారు. పుట్టుకతోనే మానవునియందు ప్రారంభమైనది ప్రేమతత్త్వం. కనుక ప్రేమను అన్నిటికంటే ప్రధానంగా తీసుకోవాలి. తల్లి దండ్రులను, అధ్యాపకులను, తోటి మానవులను ప్రేమించాలి. గౌరవించాలి. ఇంటికి వచ్చిన అతిథి, అభ్యాగతులను ఆదరించాలి. గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకోవాలి. ఇది "వన్ వే ట్రాఫిక్" కాదు. మీరు ఇతరులను గౌరవించినప్పుడే ఇతరులు మిమ్మల్ని గౌరవిస్తారు. ఇలాంటి పవిత్రమైన విషయాలను బోధించే గురువులు నేడు అరుదుగా ఉన్నారు. గురువులే కాక ఇంట్లో తల్లిదండ్రులుకూడా తమ పిల్లవాని పరిస్థితి ఏమిటి? బయటికి పోయినప్పుడు ఏవిధంగా ప్రవర్తిస్తున్నాడు? మిత్రులతో ఏవిధంగా మెలగుతున్నాడు? ఎలాంటి పుస్తకాలు చదువుతున్నాడు? అనే విషయాలను గమనించాలి. కొంతమంది పిల్లలు పాఠ్యపుస్తకాల మధ్యలో పిచ్చి పిచ్చి నవలలు పెట్టుకొని చదువుతుంటారు. కనుక తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను కడు జాగ్రత్తగా గమనించి, వారిని సక్రమమైన మార్గంలో పెట్టటానికి ప్రయత్నించాలి.

**'ఇంటర్‌నెట్' కాదు, 'ఇన్నర్‌నెట్' ప్రధానమైనది**

పిల్లలయొక్క 'బ్లడ్డు. ఫుడ్డు, దుడ్డు, హెడ్డు' అన్నీ తల్లిదండ్రులనుండి వచ్చినవే కదా! కనుక, పిల్లలు మొట్టమొదట తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత చూపించాలి. కాని ఈ కలిప్రభావంచేత పిల్లలు తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత చూపటం లేదు. ఏదో కంటికి ఎదురుగా వచ్చినప్పుడు గౌరవిస్తారుగాని,కంటికి కొంచెం దూరమైతే వారిగురించి ఏ మాత్రం ఆలోచించరు. వేదము "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ.." అని బోధించింది.



srisathyasaivachanamrutam

వేదప్రమాణములు చాలా ఉన్నతమైనవి, ఉత్కృష్టమైనవి, సౌజన్యమైనవి, సౌశీల్యమైనవి. కాని, ఇలాంటి వేదప్రమాణములను నేటి విద్యార్థులు విస్మరించి, టీ.విలోనూ, ఇంటర్‌నెట్‌లోనూ చూసినవాటిని విశ్వసిస్తున్నారు. 'ఇంటర్‌నెట్' కాదు, 'ఇన్నర్‌నెట్' ప్రధానమైనది. దానిని మీరు అనుసరించాలి. ఈనాటి పిల్లలు టీవీలోనూ, ఇంటర్‌నెట్‌లోనూ మనస్సును మాలిన్యపరచే పిచ్చి పిచ్చి విషయాలను చూస్తున్నారు. ఎలాంటి విత్తనమో అలాంటి మొక్క. ఎలాంటి తిండియో అలాంటి త్రేపు. కాబట్టి, మీరు మంచినే చూడాలి, మంచినే వినాలి, మంచినే చేయాలి, మంచినే తలంచాలి, మంచినే అనుభవించాలి. తల్లిదండ్రులు, అధ్యాపకులు పిల్లలకు ఇలాంటి సద్బోధలు గావించి వారిని ఆదర్శప్రాయులుగా తయారు చేయాలి.

**ఎవరు ధనవంతుడు? ఎవరు బీదవాడు?**

దైవభక్తిని పెంచుకోవాలి. తల్లిదండ్రులకు ఆనందం కల్గించాలి. గురువులను గౌరవించాలి. ఇలాంటి పవిత్రమైన మార్గమును అనుసరించినప్పుడే మానవుడు అమితమైన ఆనందమును పొందగలడు. అతనిని మించిన ఐశ్వర్యవంతుడు మరొకడు ఉండడు. తృప్తిగలవాడే ఈ ప్రపంచంలో అందరికంటే గొప్ప ధనవంతుడు. మితిమీరిన వాంఛలు గలవాడే అందరికంటే బీదవాడు. వాంఛలను ఒక పరిమితిలో పెట్టుకోవాలి. "నశ్రేయో నియమం వినా." మన దేహమే దీనికి ప్రత్యక్ష ప్రమాణం. మన దేహంలో టెంపరేచర్ $98.4^0$ ఓ ఉండాలి. అది $99^0$ ఓ అయిందంటే జ్వరం ప్రారంభమౌతుంది. మన బ్లడ్ ప్రెషర్ 120/80 ఉండాలి. అది 140/90 అయిందంటే రోగం ప్రారంభమైనదన్నమాట. మన కన్ను ఏదో కొంత వెలుగును మాత్రమే చూడగలదు; మితిమీరిన కాంతిని చూస్తే రెటీనా కాలిపోతుంది. ఈ విధంగా భగవంతుడు సృష్టిలో ప్రతి దానికి ఒక పరిమితిని విధించాడు. కనుక, మీ వాంఛలకు కూడా ఒక పరిమితి ఉండాలి. మితిమీరిన వాంఛలు ప్రమాదాన్ని కలిగిస్తాయి. వాంఛలను అదుపులో పెట్టుకున్నప్పుడే మీరు ఆరోగ్యమును, ఆనందమును అనుభవించగలరు.

మన దేహం చాలా ఆదర్శవంతమైనది. ఇందులో ప్రతి అంగమూ తన పని తాను చేస్తుంది. అవసరమైనప్పుడు అన్ని అంగములు ఐకమత్యంగా పనిచేసి కార్యాన్ని సాధిస్తాయి. నిత్యజీవితంలో ఈ ఆదర్శాన్ని ప్రతి నిమిషం మనం అనుభవిస్తూనే ఉన్నాము. ఒక చిన్న ఉదాహరణ : మనకళ్ళు ఒక చెట్టుపైనున్న ఫలమును చూశాయి. మనస్సులో ఆ ఫలమును

srisatyasaivachanamrutam

తినాలనే కోరిక కల్గింది. వెంటనే మన కాళ్ళు ఆ చెట్టువద్దకు నడుస్తాయి. అక్కడికి వెళ్ళిన తరువాత నడుము వంగుతుంది, చేయి ఒక రాయిని తీసుకుంటుంది, భుజం దానిని బలంకొద్దీ ఆ ఫలంవైపు విసురుతుంది. ఫలము క్రింద పడుతుంది. అప్పుడు వ్రేళ్ళు దానిని అందుకొని నోట్లో పెడతాయి. పళ్ళుదానిని నమిలి పొట్టలోకి పంపిస్తాయి. ఈరీతిగా, అన్ని అంగములూ కలసి పనిచేయటంచేతనే చెట్టుపైనున్న ఫలము పొట్టలోకి చేరింది కదా! కుటుంబంలో కూడా ఇలాంటి ఐకమత్యమున్నప్పుడు ఎలాంటి ఘనకార్యమునైనా సాధించవచ్చు.

ప్రతి ఇంట్లోనూ ఒకరినొకరు అర్థం చేసుకోవటం (Understanding), సర్దుకుపోవడం (Adjustment) ఈ రెండూ చాలా ప్రధానం. ఇవి లేకపోతే చాలా ప్రమాదం. ఒక ఉదాహరణ: పట్టణంలో నివసించేవారికి ఇది అనుభవమే! "నా భర్త మంచివాడు" అని భార్య విశ్వసించినప్పుడు అతను ఆఫీసునుండి ఎంత ఆలస్యంగా వచ్చినా అతనిని అపార్థం చేసుకోదు. "దారిలో కారు చెడిపోయిందో యేమో! ఆయన ఎంత అవస్థపడుతున్నారో పాపం!" అని అనుకుంటుంది; ప్రేమతో భర్తకోసం కాచుకుని ఉంటుంది. ఒకవేళ భర్తను సరిగా అర్థం చేసుకోకపోతే అతను ఆఫీసునుండి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా "ఎందుకండీ, ఇంత ఆలస్యంగా వచ్చారు?" అంటూ భర్తను నిలదీస్తుంది. ఇంక వారిద్దరి మధ్య "కొరియా యుద్ధం" ప్రారంభమౌతుంది. కనుక, మొట్టమొదట ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. అప్పుడు Adjustment) చాలా సులభమౌతుంది. కుటుంబంలోగాని, విద్యార్థులందు గాని, అధ్యాపకులందుగాని Understanding చాల ప్రధానం. ఒక టీచరు సెలవుపై వెళ్ళినప్పుడు అతడు తీసుకోవలసిన తరగతిని ఆ సమయంలో ఖాళీగా ఉన్న మరో టీచరు తీసుకోవాలి. తద్వారా పిల్లలకు ఉపకారం చేసినట్లవుతుంది. ఈవిధంగా, టీచర్లు ఒకరికొకరు సహాయం చేసుకోవచ్చు. కాని, ఈ కలిప్రభావం చేత ఈనాడు టీచర్సుయందుగాని, విద్యార్థులందుగాని, ఐకమత్యమే లేదు. ఒకరికొకరి మధ్య 'కో-ఆపరేషన్' ఉన్నప్పుడు ఎంతటి ఘనకార్యమునైనా సాధించుటకు వీలౌతుంది. కాని, ఈనాడు 'ఆపరేషన్' తప్ప 'కో-ఆపరేషన్' అనేదే లేదు. అనైక్యతను పెంచుకుంటున్నారు. (స్వామి తమ కర్చీఫ్‌ను చూపిస్తూ) ఇదేమిటి? అని అడిగితే ఇదొక బట్ట అని మీరు చెబుతారు. ఈ బట్ట ఎలా తయారైంది? ప్రత్తినుండి దారములు తయారైనాయి. అనేక దారముల చేరికచేత వస్త్రం ఏర్పడింది. ఒక్కొక్కదారమును విడదీస్తే

sri sathyasai vachanamrutam

దానిని వ్రేళ్ళతో సులభంగా త్రుంచివేయవచ్చు కాని, అనేక దారములు చేరి వస్త్రంగా ఏర్పడినప్పుడు అది దృఢంగా ఉంటుంది. కాబట్టి ఏకత్వంలో ఎంతైనా బలమున్నది, భద్రత ఉన్నది.

**ఆత్మవిశ్వాసం : అబ్రహాం లింకన్ ఆదర్శం**

మీరు క్రిందటి రాత్రి అబ్రహాం లింకన్‌పై ఒక డ్రామా చూశారు. అతడు చాలా బీదకుటుంబంలో జన్మించాడు. బాల్యంలో అతడు చదివిన స్కూల్లో అనేకమంది శ్రీమంతుల పిల్లలుండేవారు. వారు మంచి ఖరీదైన దుస్తులను ధరించి స్కూలుకు వచ్చేవారు; లింకన్ ధరించిన పాతదుస్తులను చూసి హేళన చేసేవారు. ఒకనాడు లింకన్ ఏడ్చుకుంటూ తల్లివద్దకు వచ్చి "అమ్మా! నేను పాతదుస్తులను ధరించటంచేత స్కూల్లో తోటిపిల్లలు నన్ను హేళన చేస్తున్నారు. నాకు మంచి దుస్తులు కావాలి" అని అన్నాడు. అప్పుడు తల్లి అతనిని దగ్గరకు తీసుకొని "నాయనా! మన ఇంటి పరిస్థితిని కొంత అర్థం చేసుకో. మీ నాన్నగారు రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేస్తున్నారు. నేను కూడా నిమిషమైన ఖాళీ లేకుండా పాతబట్టలు కుట్టి డబ్బు సంపాదిస్తున్నాను. మనకు ఎలాంటి ఆస్తిపాస్తులూ లేవు. ఆత్మవిశ్వాసమే మనకున్న ధనము. కనుక నీవు ఇతరులతో పోల్చుకోవద్దు. ఆత్మవిశ్వాసమును పెంచుకో. తప్పక అభివృద్ధికి వస్తావు" అని బోధించింది. తల్లి చెప్పిన మాటలు లింకన్ హృదయానికి హత్తుకున్నాయి. అతడు ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధిపరచుకున్నాడు. రాత్రింబవళ్ళు కష్టపడి చదివి ఉన్నతవిద్యలో ఉత్తీర్ణుడైనాడు.

లింకన్‌లో ఉన్న పవిత్ర గుణములను గమనించి అతని మిత్రులు అతనిని ఎన్నికలలో పోటీ చేయవలసిందిగా ప్రోత్సహించారు. తాము చేతనైనంత సహాయం చేస్తామని మాటిచ్చారు. లింకన్ ఎన్నికలలో గెలుపొందాడు. క్రమక్రమేణ కొంతకాలానికి అతడు అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిష్ఠించాడు. ఆ రోజుల్లో అమెరికాలో తెల్లవారు నల్లవారిని బానిసలుగా చేసుకొని చాలా బాధలకు గురిచేసేవారు. "చర్మం నలుపు కావచ్చుగాని, అందరిలో ఉన్న రక్తం ఎరుపే కదా! కాబట్టి, మీరు భేదభావాలను విడనాడి సమత్వాన్ని పాటించాలి" అని లింకన్ బోధిస్తూవచ్చాడు. తాను ప్రెసిడెంటు అయిన తరువాత బానిసత్వాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. కనీసం ఒక రొట్టె కొనుక్కోవటానికికూడా డబ్బు లేని నిరుపేద పిల్లవాడు అమెరికా ప్రెసిడెంటు పదవిని

sri sathyasai vahamrutam

చేపట్ట గల్గాడంటే... దీనికి కారణం ఆత్మవిశ్వాసమే. ప్రతి మానవుడు ఆత్మవిశ్వాసమును పోషించుకోవాలి.

### చెప్పవలసిన రీతిలో చెబితే ఎవరైనా విశ్వసిస్తారు

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా మానవతా విలువలు అందరికీ అవసరమే. చాలామంది అమెరికాలోనూ, ఇతర దేశాలలోనూ మానవతా విలువలతో విద్యాబోధనను ప్రవేశపెట్టటం కష్టమని భావిస్తున్నారు. ఎందుకు ప్రవేశపెట్టలేరు? వీటి ఆవశ్యతకను చక్కగా బోధించినప్పుడు తప్పక ప్రవేశపెడతారు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు మానవతావిలువలు అని చెబితే వారికి అర్థం కాదు. "సత్యమే దైవం, ప్రేమయే దైవం. కనుక ప్రేమతో జీవితాన్ని గడపండి" అని వారికి బోధించాలి. సత్యం చెప్పకూడదని ఎవరైనా అంటారా? "మీ పిల్లలకు సత్యం పలకమని బోధించండి" అంటే ఎవరైనా వినకుండా ఉంటారా? సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను గూర్చి ఈ విధంగా వివరించి, ఈ పదముల అంతరార్థమును చక్కగా బోధించినప్పుడు ఎవరైనా విశ్వసిస్తారు. వీటిని సరియైన రీతిలో వివరించలేకపోవటంచేతనే కొందరు పెడర్థములు కల్పించుకొని "ఇది హిందూధర్మం. మా 'కల్చర్' (సంస్కృతి) కాదు" అని అంటున్నారు. హిందువులకు గాని, క్రైస్తవులకుగాని, ముస్లింలకు గాని, అమెరికన్లకుగాని.... అందరికీ సత్యం సత్యమే. సత్యం ఒక్కటే. అదే దైవం. ఏ దేశం వారైనా దీనిని అంగీకరించక తప్పదు. 2+2=4 అనేది ఇండియన్లుగాని, అమెరికన్లుగాని, పాకిస్థాన్ వారుగాని, చైనీయులుగాని... ఏదేశం వారైనా ఒప్పుకునే తీరాలి. ఇదొక దేశమునకు, ఒక కాలమునకు సంబంధించినది కాదు. సర్వకాలములందూ సర్వదేశములకు సమానంగా వర్తించే సత్యమిది.

స్వామివద్దకు ఎంతోమంది గొప్పగొప్పవారు వస్తుంటారు. "నాయనా! నీకేమి కావాలి?" అని నేను అడిగినప్పుడు "స్వామీ! నాకు శాంతి కావాలి" అని అంటారు. శాంతి ఎక్కడుంది? అని నేనడిగినప్పుడు తమకు తెలియదంటారు. అప్పుడు నేను చెబుతాను – "నాయనా! బాహ్యప్రపంచంలో శాంతి లేదు. శాంతి నీయందే ఉన్నది. నీవే శాంతిస్వరూపుడవు. ఈ సత్యాన్ని గుర్తించు, తప్పక నీవు శాంతిని అనుభవించగలవు." ఈ సత్యాన్ని విపులంగా వివరించినప్పుడు ఎలాంటివాడైనా, ఏ దేశస్థుడైనా అంగీకరించక తప్పదు. అన్ని దేశముల వారికి, అన్ని మతములవారికి, అన్ని తరగతులవారికి అనుసరణీయమైనవి మానవతావిలువలు.

sri sathyasaivachanamrutam

మీరు మానవులుగా జన్మించారు. కాబట్టి మీరు మానవతావిలువలను పాటించాలి. మానవతా విలువలను మానవుడే నమ్మలేకపోతే ఇంకెవరు నమ్ముతారు? తన హృదయాన్ని తాను నమ్మలేనివాడు ఎలాంటివాడో తెలుసా? తనను తానుబయట వెతుక్కునే అజ్ఞాని అనే చెప్పవచ్చు. ఎవరైనా ఇతరులవద్దకు పోయి "నేనెవరిని? నేనెక్కడున్నాను?" అని అడుగుతారా? అది చాలా పిచ్చితనం. నిన్ను నీవు తెలుసుకోవాలంటే నీలో నీవు వెతుక్కోవాలి, బయట వెతికితే లాభం లేదు. విలువైన భావములను మనయందే ఉంచుకున్నాము. వాటిని పోషించుకోవాలి.

**సత్యాన్ని చెప్పకూడని స్థితిలో యుక్తినుపయోగించాలి**

సాధ్యమైనంతవరకు సత్యాన్ని వదలిపెట్టకుండా చూసుకోవాలి. అయితే, ఒక్కొక్క సమయంలో సత్యాన్ని చెబితే ప్రమాదం కల్గవచ్చు. అలాంటి పరిస్థితిలో మీరు సత్యం చెప్పవద్దు, అసత్యం చెప్పవద్దు; మౌనం వహించాలి. లేకపోతే యుక్తిగా తప్పించుకోవాలి. ఆ యుక్తికూడా ఒక యోగమే. ఒక చిన్న ఉదాహరణ: అడవిలో ఒక చెట్టుక్రింద ఒక ఋషి కూర్చొనియుండగా ఒక జింక పరుగెత్తుకుంటూ వచ్చి ఆ చెట్టు ఎదురుగా ఉన్న పొదలోకి దూరింది. ఇంతలో ఒక వేటగాడు అక్కడికి వచ్చి "స్వామీ! నేనొక జింకను తరుముకుంటూ వచ్చాను. అది ఎటువైపు వెళ్ళిందో మీరు చూశారా?" అని అడిగాడు. ఆ ఋషికి ధర్మసంకటం ఏర్పడింది. ఆ జింకను తాను చూడలేదని చెబితే అది అసత్యమౌతుంది. అది ఎటువైపు వెళ్ళిందో చెబితే ఆ వేటగాడు దానిని పట్టి చంపుతాడు. ఆయన ఒక్క క్షణం ఆలోచించి యుక్తిగా "అయ్యా, ఏది చూచెనో అది పలుకదు, ఏది పలుకునో అది చూడలేదు" అన్నాడు. అనగా కన్నులు చూచినాయిగాని, అవి మాట్లాడలేవు. నోరు చెప్పగలదుగాని, అది చూడలేదు. ఇది సత్యమే కదా? ఈ రీతిగా యుక్తిచేతను, దైవభక్తి చేతను, ఆత్మ విశ్వాసముచేతను సత్య,ధర్మ, శాంతి, ప్రేమలను పోషించుకుంటూరావాలి.

**దేవుడు కలడన్నవానికి కలడు, లేడన్నవానికి లేడు**

మానవతా విలువలను ఇతరులు అంగీకరిస్తారో, లేదో అని కొందరు భయపడుతున్నారు. భయపడితే దేనినీ సాధించలేము. సత్యాన్ని అనుసరించేటప్పుడు ఇంకొకరికి భయపడనక్కర్లేదు. ఒకడు దేవుడున్నాడని నమ్ముతాడు, మరొకడు దేవుడే లేడని అంటాడు. ఉన్నాడన్నవానికి ఉన్నాడు, లేడన్న వాడికి లేడు. "నీ దేవుడు నీకు లేకపోవచ్చుగాని, నా దేవుడు నాకున్నాడు"



srisathyasaivachanamrutam

అని ధైర్యంగా చెప్పాలి. "అయ్యో, ఇతను దేవుడు లేడంటున్నాడే! నిజంగా ఉన్నాడో లేడో" అని సందేహిస్తే మీరు బలహీనులైపోతారు. అలాంటి బలహీనతకు అవకాశమివ్వకూడదు. "నాయమాత్మా బలహీనేన లభ్యః". బలహీనుడు దేనినీ సాధించలేడు. ప్రపంచమంతా ఏకమై భగవంతుడు లేడని వాదించినప్పటికీ మీ విశ్వాసం చలించకూడదు. మీ సత్యం మీది, మీ విశ్వాసం మీది. అంతటి ధృఢవిశ్వాసమును కల్గియున్నప్పుడే మీరు మానవతావిలువలను ప్రచారం చేయటానికి వీలౌతుంది."లోకో భిన్న రుచిః", తలలు వేరుగా ఉన్నప్పుడు తలంపులుకూడా వేరుగా ఉంటాయి. కనుక ఇతరులేమన్నా మీరు లెక్కచేయవద్దు. మీ అంతరాత్మను మీరు అనుసరించండి. మీలో ఆత్మవిశ్వాసం లేకపోతే మీరు బలహీనులౌతారు. అలాంటి బలహీనతకు చోటివ్వకండి. మానవుడు ధైర్యసాహసములు కల్గినవాడేగాని, బలహీనతకు చోటిచ్చేవాడు కాదు.

మన సంస్థలవారు మానవతావిలువలలో విద్యా బోధనను అభివృద్ధి పరచాలని, దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం సల్పాలని ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. మీరు చెప్పదల్చుకున్నది ఇతరులకు అర్థమయ్యేరీతిలో చక్కగ వివరించండి. వారు వింటే వింటారు. పోతే పోతారు. మీరు మాత్రం మీ సత్యాన్ని వదలకుండా చూసుకోండి. మానవతా విలువలు మానవునినుండియే వచ్చాయిగాని, ఎక్కడినుండో రావటం లేదు. వీటి పేరే మానవతా విలువలు. అనగా ఇవి మానవుని హృదయంలోనే ఉన్నాయి. వీటిని మీరు బయటకి తీయాలి. దీనినే 'ఎడ్యుకేర్' అన్నారు. ఇది పుస్తకాలను చదవటం వల్ల లభించేది కాదు.

**హృదయం, వాక్కు, చేతలు ఏకం కావాలి**

విద్యార్థులారా! విద్యావంతులారా! విద్యాపోషకులారా! విద్యాభిమానులారా! మానవుడు మానవతా విలువలను విస్మరిస్తే ప్రపంచమే నాశనమైపోతుంది. మానవతావిలువలే మన పంచప్రాణాలు. వీటిని ప్రచారం చేయటానికి సత్యసాయి సంస్థలవారు ఎంతో శ్రమ పడుతున్నారు. వారికి తగిన ఉత్సాహప్రోత్సాహాలనివ్వాలి. మీరు అనేక దేశాలనుండి వచ్చి ఈ సదస్సులో పాల్గొన్నారు. మీరు అంతదూరం నుండి ప్రశాంతినిలయానికి వచ్చినందుకు ఇక్కడినుండి ఏదైనా విలువైనది మీవెంట తీసుకొని వెళ్ళాలి. ఏమిటి మీవెంట తీసుకువెళ్ళవలసింది? అదే సత్యము, అదే ప్రేమ. మీ దేశానికి తిరిగి వెళ్ళినతరువాత "నేను



sri sathyasai vahini amrutam

ప్రశాంతినిలయంనుండి సత్యమును, ప్రేమను నా వెంట తెచ్చాను" అని చెబితే మి తోటివారుకూడా ఎంతో ఆనందిస్తారు. మీరు ఆనందాన్ని అనుభవించి ఇతరులకుకూడా ఆనందం కల్గించండి. ఇక్కడ మీరు తెలుసుకున్న విషయాలను పదిమందికి పంచండి. అదియే మీరు చేయవలసిన ప్రచారం. మానవతావిలువలతో కూడి విద్యాబోధన Education in Human Values) ను మనం EHV అంటున్నాము. దీనినే 3ూ అని కూడా చెప్పవచ్చును. Heart, Head, Hand - ఈ మూడింటి ఏకత్వమే నిజమైన మానవతావిలువ. కనుక జూఽజ అంటే ఏవో పెద్ద పెద్ద అర్థాలు తీసుకొని ప్రచారం చేయకండి. హృదయం, వాక్కు, చేతలు - ఈ మూడింటి మధ్య పొందిక ఉండాలి. హృదయంలో తలచినది నోటితో చెప్పాలి. నోటితో చెప్పినది ఆచరణలో పెట్టాలి. దీనిని మించిన మానవతావిలువ లేదు. దీనిని సులభంగా అందరికీ బోధించవచ్చును.

**మీరు నేర్చిన విద్య ప్రపంచానికి మేలు చేయాలి**

మొట్టమొదట మీరు నేర్చిన Education x Skill చేయాలి. Education అనేది విజ్ఞాన శక్తికి, Skill అనేది నైపుణ్యశక్తికి సంబంధించినవి. మీ విజ్ఞానశక్తికి నైపుణ్యశక్తిని చేర్చినప్పుడే మీ విద్యకు Balance అవసరం. మన నడకలో Balance ఉండాలి. అదేరీతిగా మన ' ఎడ్యుకేషన్' లో కూడా Balance ఉండాలి. అప్పుడే ప్రపంచంకూడా సుక్షేమంగా ఉంటుంది. ఏది సత్యము? ఏది ధర్మము? అని విచారణ చేసి, దానికి సంబంధించిన నైపుణ్యశక్తిని విద్యలో ఉపయోగపెట్టాలి. ఈనాటి సైంటిస్టులు ప్రాణాలను భస్మం చేసే బాంబులను తయారుచేస్తున్నారు. అది గొప్ప విద్య అని భావిస్తున్నారు. కాదు, కాదు. వారు తమ పరిశోధనలద్వారా ప్రపంచానికి మేలు కల్గేటట్లు చూడాలి. అప్పుడే Balance సరిపోతుంది. కరెంటు మనకు వెలుగు నిస్తున్నది, దారి చూపుతున్నాది, పంటలు పండించటానికి నీటిని పంపు చేస్తున్నది, ఫ్యానుద్వారా గాలినందించి వేడిని పోగొడుతున్నది.... ఈ రీతిగా మనకెంతగానో ఉపయోగపడుతున్నది కదా అని కృతజ్ఞతతో "ఓ కరెంటా! నీవు నాకు చాల ఉపకారం చేస్తున్నావు" అని దానిని పట్టుకుంటే తక్షణమే ప్రాణం తీస్తుంది.

కనుక, ఏది ఏవిధంగా మనకు ఉపయోగపడగలదో తెలుసుకొని దానిని అంతవరకే ఉపయోగపెట్టుకోవాలి. సైన్సు మరియు టెక్నాలజీ రంగంలో సైంటిస్టులు సాధించిన ప్రగతిని

sri satyasai vacharamrutam

ప్రజలకు అనుకూలమైన రీతిలో ఉపయోగపెడితే ప్రపంచానికి ఎంతో మేలు జరుగుతుంది. కాని, ఈనాటి మానవుడు సరియైన విచారణ చేయడం లేదు. కనుకనే Balance తప్పిపోతున్నది. Education ని sikll చేసినప్పుడే Balance వస్తుంది. Balance ఉన్నప్పుడే Insight (అంతరదృష్టి) అభివృద్ధి అవుతుంది. Balance లేకపోతే దృష్టి నిరంతరం బహిర్ముఖంగానే ఉంటుంది. అంతర్దృష్టియే Balance కి సరియైన గుర్తు. Education - skill - Balance - Insight... ఇవి మానవునికి అత్యవసరం. ఈనాటి మానవుడు ఇంటర్‌నెట్, రేడియో, వీడియో, టీవీలలో ఎన్నో విషయాలను చూస్తున్నాడు, వింటున్నాడు. కాని, వాటినుండి ఏమైనా మంచిని నేర్చుకుంటున్నాడా? లేకపోతే కాలమును వ్యర్థం చేసినట్లే కదా! 'ఇంటర్‌నెట్' కంటే 'ఇన్నర్‌నెట్' పై దృష్టిని కేంద్రీకరించాలి. హృదయాన్ని పవిత్రం చేసుకోవాలి. 'ఇంటర్‌నెట్' లో జూసజ ని ప్రవేశపెట్టడంవల్ల ఎంతైనా ఉపయోగపడుతుంది. ఆధునిక విద్యలో ఆధ్యాత్మికవిలువలను చేర్చాలి. ఆధ్యాత్మికమనేది ఆత్మవిశ్వాసంపై ఆధారపడియుంది. "ఈమె నాతల్లి" అని విశ్వసించటంవల్లనే మీరు మీ తల్లిని ప్రేమించగల్గుతున్నారు. "ఇతను నాభర్త," అని విశ్వసించటంవల్లనే భార్య భర్తను ప్రేమించగల్గుతున్నది. కాబట్టి విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ. శాంతి ఎక్కడో సత్యమక్కడ. సత్యమెక్కడో ఆనందమక్కడ. ఆనందమెక్కడో దైవమక్కడ. ఈనాటి మానవుడు ఆత్మవిశ్వాసమును కోల్పోవటంచేతనే శాంతిని, ఆనందమును అనుభవించలేక పోతున్నాడు.

**(29.9.2000 ఉదయం మానవతా విలువలపై అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasaivachanamrutam